# చలిమంట

మొదటి బహుమతి :

(రూ. 50/-)

ఇంటిగంటకొట్టి గంట అయినా ఇంకా ఆఫీసు కాగితాలతోనే కుస్తీ పడుతున్నారు హెడ్‌మాష్టారు రంగనాథంగారు. ఆ వూరు పెద్ద వూరూ కాదు; అలాగని పల్లెటూరూ కాదు. ఆ వూరి హైస్కూలు హెడ్‌మాష్టర్‌గా రంగనాథంగారు నాలుగేళ్ళనుంచీ పనిచేస్తున్నారు. ఊళ్ళో పేరున్న వ్యక్తులలో ఆయనొకరు—

'సార్! విజయలక్ష్మిగారు మీకీ కవరు యిమ్మన్నారండి' ప్యూను జమలయ్య గొంతువిని తలెత్తి చూశారు హెడ్‌మాష్టారు. అది పెద్ద కవరు! అందులో ఐదు కవర్లు, ఒక చిన్న ఉత్తరం, ఒక పెద్ద తెల్ల కాయితం ఉన్నాయ్.

'సరే! అమ్మగారితో నేను కొంచెం ఆలస్యంగా వస్తానని చెప్పు-నువ్వెళ్ళు' ప్యూను అక్కడ వుండడం శ్రేయస్కరం కాదని కాబోలు బయటికి పంపించారు. మొదటి కవరు మీద 'శ్రీ తెలుగు మాష్టారు' అని వుంది. విప్పి చదవడం మొదలు పెట్టారు. అది ప్రేమలేఖ!

ప్రాణసఖీ!

అలనాడు ఇంద్రసభలోని రంభా ఊర్వశుల సౌందర్యమును గూర్చి వినియుంటిని, చదివి యుంటినేగాని నీ రాకతో నా కన్నులకు చూచు భాగ్యముకూడ కలిగినది. ధన్యుడనైతి! నీ రాకకు పూర్వము నాకు 'ప్రేమ' యన్నగాని, 'పెళ్ళి'యన్నగాని అసహ్యము, ఏవగింపుగా నుండెడిది. నీ రాకతో నా హృదయమునందు ప్రేమ బీజములునాటుకొని; నీమాట విన్నంతనే మొగ్గగా రూపొంది; నీ పలకరింపుతో ఓలకరించి పుష్పించినది. ఇక ఫలరూపము నొందుటయే తదుపరి దశ. దానికి నీ యంగీకారము ఎంతేని అవసరముగదా! కావున నీ అంగీకారముకూడ లభించినచో ఆ కల్యాణ చక్రవర్తి సమక్షమున మన కల్యాణము కాగలదు. త్వరితగతిని నీ సమాధానమును లేఖా పూర్వకముగా తెలుపుము. నీ లేఖ కొఱకు చంద్రుని కొఱకు చాతకపక్షివలె ఎదురు చూచుచూయుందును.

నీ వాడు

సుబ్రహ్మణ్య శర్మ.

ఇడియట్ అని తెలుగు మాష్టార్ని దీవిస్తూ, రెండో కవరు లోంచి ఉత్తరం తీశారు రంగనాథం

గారు. దానిమీద 'శ్రీ సోషల్ మాష్టారు' అని వుంది.

డియర్ విజయా!

నిన్ను చూసిన రోజునే-కాదు-నీకీవూరు బదిలీ అయిందని తెలిసిన రోజునే-భారతదేశంయొక్క ఎల్లలు మర్చిపోయానంటే నమ్మవేమో! బంగాళాఖాతం మొదలుకొని బొంబాయివరకు ఎక్కడ చూచినా నువ్వే కనపడుతున్నావ్!

క్లాసులో పిల్లలకీ, పాఠాలకి తిలోదకాలు యిచ్చేశాను. ఎంతసేపూ నిన్ను గురించే ఆలోచన. నువ్వూ, నీ అందం తప్పితే నా కళ్ళకి ఏమీ కనుపించటంలేదు. అబ్బ! నువ్వు ఎంత అందంగా ఉంటావో నీకు తెలుసా విజయా?

తాజ్‌మహల్ కన్నా - దాల్ లేక్ కన్నా నువ్వే అందంగా ఉంటావ్! నిజంగా! నిన్ను చూస్తూవుంటే; తుగ్లక్‌నై పోతానేమోనని నాకు భయంగాకూడా వుంది - అంత అందంగాఉన్నావ్! మరినిన్ను ప్రేమించటంలో నా తప్పేముందీ? నిన్ను చూస్తే... పెళ్ళాన్ని వదిలిన బుద్ధుడు కూడా, బుద్ధిమార్చుకుని నిన్ను పెళ్ళి చేసుకుంటాడు.

ఇకపోతే—మిగిలింది నీ యాక్సెప్టేషన్. నువ్వుకూడా అంగీకరిస్తే మనిద్దరం మద్రాసుపోయి రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం. వెంటనే సమాధానం యిస్తావ్ కదూ!—

నీ

రాజశేఖర్.

'ఫూల్ - ఉట్టి రోగ్' అనే సర్టిఫికేట్ సోషల్ మాష్టారుకిచ్చి మూడో కవరుమీదికి దృష్టి సారించారు రంగనాథంగారు. దానిమీద 'శ్రీ లెక్కల మాష్టారు' అని వుంది.

'అరే! ఒకే అమ్మాయికోసం యింతమందా!' అని కొంచెంసేపు ఆశ్చర్యపోయి — 'అయినా అందం అలాంటిది' అని సర్దిచెప్పుకుని— సర్దుకు కూర్చున్నారు రంగనాథంగారు. మామూలుగానే మూడో ఉత్తరంకూడా విప్పారు.

మైడియర్ విజ్జీ!

ఒకటి, ఒకటి కలిస్తే రెండుకాదు, అన్నా ఒప్పుకుంటాను—

ఆరుపదులు తొంభైనాలుగు అన్నా ఒప్పుకుంటానుగానీ—

'నువ్వు ఏమంత అందగత్తెవు కావు' అని నిన్ను ఎవరైనా ఎప్పుడైనా, ఎక్కడైనా సరే-అన్నారంటే మాత్రం నేను ఒప్పుకోను సరికదా-వాళ్ళని నేనేం చేస్తానో నాకే తెలియదు.

ఈ దేశంలోని ఏభైకోట్ల జనాభాలో నీలాంటి అందమైనదాన్ని-నా రెండు కళ్ళూ చూడలేదని లక్షసార్లు చెప్పినా నువ్వు నమ్మాలి! నిజంగా నువ్వంతఅందంగా వుంటావ్ విజ్జీ!


**యం. యస్. యన్. శేషు**

బి. కామ్., 2వ సంవత్సరం,

డి. ఎ. ఆర్. కాలేజి,

నూజివీడు.

నారూము దగ్గర్నించీ-ఈస్కూలు దాకా - అంటే మైలున్నర దూరం పావుగంటలో నడచి వస్తున్నానంటే నా వేగాన్ని నువ్వు అర్థం చేసుకోవాలి. అంత తొందరగా ఎందుకు వస్తున్నానంటావ్? నిన్ను చూడాలనే తహతహ-ఆతురత. నీ ప్రేమకోసం ఏదైనా చేయగలను. చెప్పు! ఏం చెయ్యమంటావ్? ఒక్కటికాదు విజ్జీ! వెయ్యిచెప్పు - లక్ష చెప్పు. చేస్తాను నీ కోసం! నాకు కావలసింది అదే-నీ ప్రేమ-నువ్వు!

వెంటనే సమాధానం యిస్తావ్ కదూ!

నీ
శత కోటిలింగం.

"ఇతడొక ఫూల్ - తొందఱలో ట్రాన్స్ ఫర్ చేయించాలి" అనుకుంటూ నాలుగో ఉత్తరాన్ని అందుకున్నారు రంగనాధంగారు. దాని మీద "శ్రీ సైన్సు మాష్టారు" అని వుంది.

ప్రియమైన విజయా!

పూర్వం నా హృదయం "ఉక్కు" లాగ గట్టిగా ఉండేది. కాని నిన్ను చూసినరోజునే అది "అభ్రకం"గా మారిపోయింది.

అది నా తప్పుకాదు-! వెండిలా ధగధగ మెరిసిపోయే బంగారం లాంటి నీ శరీరం చూసిం తర్వాత-దానికోసం అర్రులు చాచనివాడు వెధవ! మగవాడుకాదు. అందుకే నిన్ను ప్రేమించాను. నాప్రేమ స్వచ్ఛమైనది. నువ్వుకూడా అంగీకరిస్తే దానికి రంగు, రుచి, వాసనా వస్తాయ్! అపుడు అది నీలో కరుగుతుంది. నువ్వు తప్పక ఒప్పుకోవాలి.

అప్పటిదాకా అది నా గుండెని మండిస్తూ-అది మండుతూ వుంటుంది. నువ్వు తిరస్కరిస్తే అది ఆరిపోతుంది. అలా జరగకూడదువిజయా! ఏమైనా సరే! నీ ప్రేమ నా ప్రేమతో సంయోగం చెందాలి—అప్పుడు అది మిశ్రమం అవుతుంది—అంటే మన పెళ్ళి అవుతుందన్నమాట. నువ్వు నా ప్రేమని అంగీకరిస్తావనే ఆశతో వ్రాస్తున్నాను. నువ్వు తిరస్కరిస్తే నేను బ్రతుకలేను. అనాడు ఏ పొటాషియం సైనేడో తాగి చచ్చిపోతాను. లేకపోతే ఏ 2HO లేని—సారీ—ఏ నీళ్ళు లేని నూతిలోనో దూకి చచ్చిపోతాను.

నన్ను అర్థం చేసుకొని నాప్రేమని అంగీకరిస్తావ్ కదూ!

అన్నట్టు — నేనుయాటంబాంబు ఫార్ములాని కొత్త విధానంలో రిసెర్చి చేస్తున్నాను. అది పూర్తయ్యిందంటే, మనిద్దరం ఏ రష్యాయో అమెరికాయో పోదాం-ఏం?

నీ
ద్రావకరావ్.

"వీడికి ఫార్మాలిటీసే తెలియవ్-ఫార్ములా ఒకటా వీడి మొహానికి" అనుకుంటూ ఐదో ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నారు రంగనాధంగారు. దాని మీద "శ్రీ డ్రాయింగ్ మాష్టారు" అనివుంది.

'అరె! ఇతడికికూడా కావలసి వచ్చిందా—ప్రేమ' అనుకుంటూనే విప్పేరు రంగనాధంగారు.

నా సజీవ శిల్పసుందరికి,

నిన్ను చూసిన మొదటి రోజున నా చేతుల్లోంచి జామెట్రీ బాక్స్ క్రిందపడటం - నువ్వు గమనించే ఉంటావ్! నీ అంత అందమైన విగ్రహాన్ని యింతవరకు చూడకపోటం—జామెట్రీ బాక్స్ క్రింద పడటానికి కారణం కావొచ్చు—కావచ్చు ఏమిటీ? అదే కారణం. నిజం సుందరీ! నిన్ను చూస్తూవుంటే నా కళ్ళు చెదిరిపోతాయ్-నా చేతులూ కాళ్లూ వణికి పోతాయ్-అసలు నా మతే పోతుంది. పోతుంది ఏమిటీ? పోయింది—నా మతి పోయింది.

మొన్న క్లాసులో ఏం జరిగిందో తెలుసా? పిల్లలతో కోతిబొమ్మ వేసుకోమని చెప్పి, బోర్డుమీద కుక్క బొమ్మ వేశాను. మునసబుగారబ్బాయ్ తన బొమ్మ వెయ్యమని అడిగితే-సరేనని - బోర్డుదగ్గరికి వెళ్ళి కోతిబొమ్మవేశాను. దాంతో వాడు వెళ్ళి వాళ్ళ నాన్నతో చెప్పడం—వాళ్ళ నాన్న నన్నుపిల్చి పాఠం చెప్పడం— అన్నీ జరిగిపోయాయ్! ఇదంతా నీ మూలంగానే జరిగింది.


## వరద బాధితులకు సహాయం చేయండి

'మునుపెన్నడూ' ఎరుగని కరువును గత రెండేళ్ళలో అసమాన శక్తితో మనం ఎదుర్కొన్నాము. ఇప్పుడు ఉద్ధృతమైన వరదల వలన దేశంలోని చాలా ప్రాంతాలలో సోదర ప్రజలు నిలువనీడ లేకుండా వున్నారు. వారికి మన సహాయం కావాలి. ఆపదలో వున్న స్త్రీ పురుషులకు, పిల్లలకు కావలసిన సహాయం అందజేయటానికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి ఉదారంగా విరాళమివ్వమని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.'

— ఇందిరాగాంధీ

ప్రధాన మంత్రి
జాతీయ సహాయనిధికి
ధారాళంగా విరాళ మివ్వండి

విరాళాలను
ఈ క్రింది అడ్రసుకు పంపండి.
సెక్రటరీ,
ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి
ప్రధానమంత్రి సచివాలయం,
న్యూ ఢిల్లీ.

DAVP 67/F4

నీ మీద నాకు భలే కోపంగా ఉందిలే! అయినా... నీకు నేను చెప్పందే ఎలా తెలుస్తుంది? అందుకే వ్రాస్తున్నాను.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ ప్రేమకోసం తపిస్తున్నాను. పరితపిస్తున్నాను. వెంటనే నీ అంగీకారం తెలుపుతూ ఉత్తరం వ్రాస్తావు కదూ!—

నీ
హనుమంతు.

'ఇతడికంటే, ఇతడు వేసిన కోతిబొమ్మే బాగుంటుంది' రంగనాథంగారు అనుకుని—ఒక వేడి నిట్టూర్పు విడిచారు. టైము ఏడు గంటలు కావస్తోంది.

ఐదు కవర్లూ అయిపోయాయ్. ఇక మిగిలినవి-చిన్న ఉత్తరం-మడిచిన తెల్లకాయితం. మొదట చిన్న ఉత్తరాన్ని విప్పారు రంగనాథంగారు.

గౌ॥ హెడ్‌మాష్టారుగార్కి,

చూశారుగా! ఈ సంఘంలో స్త్రీకి ఎంతటి విలువవుందో నా కిప్పుడిప్పుడే అర్థం అవుతోంది. పొట్టకూటికోసం ఎందరో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు.

ఇలాంటి వాళ్ళని ధైర్యంతో ఎదుర్కొనే ఆడవాళ్లూ వుంటారు. కాని నాకు అంతటి గుండె ధైర్యం, గుండె నిబ్బరంలేవు. దురదృష్టవంతురాల్ని!

ఇక పోతే—మీరు చెయ్యవల్సిందీ-చెయ్యగలిగిందీ ఒక్కటే— అదే నా రాజీనామాని అంగీకరించడం.

కృతజ్ఞురాల్ని.
మీ విధేయురాలు
వి. విజయలక్ష్మి.

పి. యస్: మీకు పంపించిన ఈ ఉత్తరా లన్నింటినీ దయచేసి తగలబెట్టండి. ఇలా మీకు పంపించినట్లు ఎవరికీ చెప్పకండి. అందులో ఎవరితప్పూలేదు. కాలంఅటువంటిది. చలికాలంలో చలిమంట దగ్గర చలి కాచుకోవాలనుకోడం లోకధర్మం. దయచేసి ఆ ఉత్తరా లన్నిటినీ తగులపెట్టండి.

రాజీనామా కాయితాన్ని ఫైల్లో గుచ్చి, కుర్చీలోంచి లేచారు రంగనాథంగారు. విజయలక్ష్మి కోరిన ప్రకారం — ఉత్తరాలన్నీ తీసుకుని గ్రౌండులోకి నడిచారు. కోటు జేబులోంచి అగ్గిపెట్టెతీసి—అన్ని ఉత్తరాలు ఒకచోటపేర్చి - అగ్గిపుల్లగీసి అంటించారు.

మండించే కోరికల కాయితాలు మండుతున్నాయ్!

ఎందుకో నవ్వుకున్నారు రంగనాథంగారు.

ఒక నిమిషం ఆలోచించి - తల పంకించి 'ఇంకానయం! నేనుకూడా యిచ్చేశానుకాదు' అని పైకే అని, తన జేబులోనుంచికూడా ఒక కవరు తీసి మండే మంటలో పడేశారు- గౌరవనీయులు రంగనాథంగారు.

□□□